ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జూలై 21 : ఆషాఢం బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కామారెడ్డి పట్టణంలోని రాజానగర్‌లో ఉన్న పోచమ్మ ఆలయం, స్నేహపురి కాలనీలోని మైసమ్మ, రుక్మిణి కుంటలోని కట్ట మైసమ్మ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఆషాఢమాసం, బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ దేవతల ఆశీర్వాదం ఉండాలని, ఈ సంవత్సరం వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

లింగంపేట/ రామారెడ్డి/ పెద్దకొడప్‌గల్, జూలై 21: కొత్తగా పట్టాపాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని లింగంపేట, పెద్దకొడప్‌గల్, రామారెడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారులు అనిల్‌కుమార్, నదీముద్దీన్, ప్రజాపతి ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. గత సంవత్సరం జూన్ నెలలో 28వ తేదీ వరకు భూములు కొనుగోలు చేసి ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు రైతుబీమాకు అర్హులని తెలిపారు.రైతులు దరఖాస్తు ఫారంతోపాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, నామినీ ఆధార్ కార్డు జతపరిచి సంబంధిత ఏఈవోకు అందజేయాలని సూచించారు. అర్హులైన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కుక్కల బెడదను నివారించండి

ఎల్లారెడ్డి రూరల్, జూలై 21: ఎల్లారెడ్డిలోని మూడో వార్డులో కుక్కల బెడదను నివారించాలని పలువురు మున్సిపల్ మే నేజర్ వాసంతికి వినతిపత్రం అందజేశా రు. కుక్కల బెడదతో రోడ్లపైకి రావాలంటేనే భయంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎన్ని వినతులు ఇచ్చినా పట్టించు కోవ డం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అడవిని తలపిస్తున్న పశువుల దవాఖాన

దవాఖాన ఎదుట పెరిగిన పిచ్చిమొక్కలు

నాగిరెడ్డిపేట, జూలై 21: నాగిరెడ్డిపేట పశువుల దవాఖాన చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి అడవిని తలపిస్తున్నది. మండల కేంద్రంలో పశువుల దవాఖానను ఐదు సంవత్సరాల క్రితం రూ.35 లక్షలతో నిర్మించగా.. అందులో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. కానీ ఐదేండ్లలో చుట్టు పక్కల ఉన్న పిచ్చి మొక్కలు, గడ్డిని కూడా తొలగించలేదు. దీంతో చుట్టూ పెద్ద పొదలు పెరిగి చిట్టడవిగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో కనీసం పిచ్చి మొక్కలు కూడా తొలగించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయానికి ఒక అటెండర్ ఉన్నా దాని దుస్థితి ఇలా ఉందంటే.. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో అర్థమవుతున్నది. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

రెండు రోజులుగా 'ముసురు'కుంది

జోరుగా ప్రవహిస్తున్న అంకోల్ క్యాంపు వాగు

కామారెడ్డి పట్టణంలోని 47వ వార్డులో కూలిన ఇల్లు

ఎల్లారెడ్డి/లింగంపేట/నాగిరెడ్డిపేట/గాంధారి/కామారెడ్డి/నస్రుల్లాబాద్, జూలై 21: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా ముసురు పడుతున్నది. గాంధారి మండలవ్యాప్తంగా శనివారం కురిసిన వర్షం 45.4మిల్లీమీటర్లుగా నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా నీరు లేక ఎండిపోయిన గాంధారి వాగుతోపాటు పొతంగల్, ముదెల్లి వాగుల్లోకి స్వల్పంగా నీరు ప్రవహిస్తున్నది. గాంధారి పెద్ద చెరువు, గండివేట్, సీతాయిపల్లి, మేడిపల్లి, ముదెల్లి, చెన్నాపూర్, తిప్పారం, గుజ్జల్, దుర్గం, సోమారంతండా, పొతంగల్ కలాన్, పొంతగల్ కుర్దు, గుర్జాల్, రాంలక్ష్మణ్‌పల్లి, పేట్ సంగెం, మాతు సంగెం గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరుతున్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం తో బోరుబావుల వద్ద నాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే సాగుచేసిన మక్క, పత్తి తదితర పంటలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షం మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. లింగంపేట పెద్దవాగు జలకళను సంతరించుకున్నది. సీజన్ ప్రారంభం నుంచి వర్షాలు లేకపోవడంతో వాగులో నీరు అడుగంటింది. కాగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దవాగులో నీటి ప్రవాహం ప్రారంభమైంది. దీంతో రైతులకు పంటల సాగుపై ఆశలు చిగురించాయి. పెద్దవాగుపై ఆధారపడి వేలాది ఎకరాల్లో పంటలను సాగుచేస్తారు. లింగంపేట ఊర చెరువుతోపాటు రెండు కుంటలకు కూడా పెద్దవాగు నీరే ఆధారం. పెద్దవాగు వరద నాగారం వద్ద చెక్‌డ్యామ్‌ను దాటి లింగంపేట వరకు చేరుకున్నది. పోచారం ప్రాజెక్టుకు ప్రధాన కాలువ కూడా లింగంపేట పెద్ద వాగే కావడం గమనార్హం.

నాగిరెడ్డిపేట మండలంలో మూడు రోజులుగా చిరుజల్లులు పడుతున్నాయి. ముసురేయడంతో ప్రజలు ఇండ్లల్లో నుంచి బయటికి రావడం లేదు. దుకాణాలు బోసిపోతున్నాయి. మరిన్ని భారీ వర్షాలు కురియాలని రైతులు కోరుతున్నారు. కామారెడ్డి పట్టణంలోని 47వ వార్డులో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పాత ఇండ్లు కూలాయి. ఆ వార్డులో బీఆర్ఎస్ నాయకుడు గెరగంటి లక్ష్మీనారాయణ కూలిన ఇండ్లను పరిశీలించారు. ఎల్లారెడ్డి మండలంలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 24 గంటల పాటు కురిసిన వర్షం 59.4 మి.మీటర్లుగా నమోదైనట్లు ఎంపీఎస్‌వో స్వాతి తెలిపారు. రెండు రోజులుగా ముసురు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నదని, అలాంటి ఇండ్లలో ఉండొద్దని సూచించారు.

నస్రుల్లాబాద్ మండలంలోని వాగులు, ఆయా గ్రామాల చెరువులు శనివారం రాత్రి కురిసిన వర్షానికి జలకళను సంతరించుకున్నాయి. మండలంలోని అంకోల్ వాగు, నెమ్లి వాగు నీటితో ప్రవహించాయి. ఈ వర్షంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 66.6 మి.మీ వర్షపాతం నమోదైందని ఏఎస్‌వో తెలిపారు.

లింగంపేట పెద్దవాగులో ప్రవహిస్తున్న వరద

కామారెడ్డి పట్టణంలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు

ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయాలి

నాగిరెడ్డిపేట, జూలై 21: ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.రెండు లక్షల వరకు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సగానికి పైగా రైతులకు రూ.లక్షలోపు రుణాలు మాఫీ కాలేదని పేర్కొన్నారు. ఏకకాలంలో రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

ఇద్దరి అదృశ్యం

స్వరూప, సౌజన్య

కామారెడ్డి రూరల్, జూలై 21 : మండలంలోని గూడెం గ్రామానికి చెందిన స్వరూప అనే వివాహిత తన పాప తేజస్వినితో కలిసి అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన స్వరూప భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి పోయిందన్నారు. చుట్టుపక్కల, బంధువులు ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో యువతి

కామారెడ్డి మండలంలోని శాబ్దిపూర్‌కు చెందిన కలిగోట్ సౌజన్య అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్‌కు సన్మానం



రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజును సన్మానిస్తున్న చిన్నరాంపూర్ గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, జూలై 21 : రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను మండలంలోని చిన్నరాంపూర్ గ్రామస్తులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయన స్వగృహంలో సన్మానించారు. గ్రామస్తులు శాలువా కప్పి, పూలబోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంజయ్య, గ్రామస్తులు సాయిలు, గణేశ్, విఠల్, సత్యనారాయణ, గంగాధర్, కుర్మ పెద్ద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలో పడి మహిళ మృతి

కామారెడ్డి, జూలై 21 : గుంతలో పడి మహిళా మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంథని దేవునిపల్లి గ్రామానికి చెందిన కామటి భూమయ్య, అతని భార్య కామాటి రాజేశ్వరీతో కలిసి కామారెడ్డి పట్టణంలోని తాహెర్ ఫంక్షన్ హాల్ వెనకాల కొత్తగా నిర్మిస్తున్న భవనంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. అదే భవనంలో మూడో అంతస్తులోని ఒక గదిలో నివాసం ఉంటున్నారు. అయితే శనివారం రాత్రి రాజేశ్వరీ(55) భోజనం చేసిన తర్వాత చేయి కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు లిఫ్ట్ కోసం తీసిన గుంతలో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గుంతలో నుంచి బయటికి తీసి పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. భర్త భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

బీబీపేట్ జూలై 21: రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 28 వరకు ఉన్న కొత్త పట్టాదారు పుస్తకం వచ్చినవారు, పట్టా పాస్ బుక్ ఉండి ఇప్పటి వరకు బీమా చేసుకోని రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతు బీమా కోసం దరఖాస్తు పత్రం, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఏఈవోకు రైతు వేదికలో సమర్పిస్తే, 2024 ఆగస్టు నుంచి వారు రైతు బీమాకు అర్హులవుతారని తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి,జూలై 21 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

బేగంపూర్ తండాలో
సంత్ రామ్‌రావు మహరాజ్ జయంతి

రామ్‌రావు మహరాజ్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న బంజారాలు

పెద్దకొడప్‌గల్, జూలై 21: బంజారాల గురువు సంత్ రామ్‌రావు మహరాజ్ జయంతిని మండలంలోని బేగంపూర్ తండావాసులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దేవీసింగ్ మహరాజ్ మాట్లాడుతూ.. రామ్‌రావు మహరాజ్ గురుపౌర్ణమి రోజున జన్మించారని తెలిపారు. బంజారాలను ఏకతాటిపై నడిపిన వ్యక్తి అని కొనియాడారు. ఆలయం వద్ద భోగ్‌భండార్ నిర్వహించారు. కార్యక్రమంలో గంగారాంనాయక్, చందర్ నాయక్, బాబూ సింగ్, తండావాసులు పాల్గొన్నారు.

వాగులోకి రైస్‌మిల్ వ్యర్థ జలాలు

వాగులో పారుతున్న కలుషిత నీరు

గాంధారి, జూలై 21: మండల కేంద్రం సమీపంలోని ఈదుల్లా వాగులోకి గుడిమెట్ గ్రామ సమీపంలోని బాయిల్డ్ రైస్‌మిల్లుకు చెందిన వ్యర్థ జలాలు వచ్చి చేరుతున్నాయి. రైస్‌మిల్ నుంచి వస్తున్న వ్యర్థాలు దాని పక్కనే ఉన్న ఒర్రెలోకి వదులుతున్నారు. అవి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగులో కలుస్తున్నాయి. దీంతో వాగులోని నీరు తాగి పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని, భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని, బోరు బావుల నుంచి కూడా కలుషిత నీరు వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఉత్సవాల్లో పాల్గొన్న బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు
- కామారెడ్డిలో యోగా గురువులకు సన్మానం

ఎల్లారెడ్డిలోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన వ్రతంలో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డి రూరల్/ బిచ్కుంద/ లింగంపేట/ నస్రుల్లాబాద్/ కామారెడ్డి, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఎల్లారెడ్డిలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ఆలయ పూజారి విజయ్ పంతులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చెన్న వీరేశలింగం (అమెరికా) దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. వేద పండితుడు వైభవ్ పంతులు, ఎస్సై మహేశ్ దంపతులతోపాటు న్యాయవాదులు గోపాల్‌రావు, సాయిప్రకాశ్ దేశ్‌పాండే దంపతులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బిచ్కుందలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి ఆలయంలో దత్తు పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాయి రాంతోపాటు బసన్‌బోయి హన్మాండ్లు, తౌటి సాయిలు, గోపి బశెట్టి, సచిన్, పిట్ల సాయిలు, పుట్ట విఠల్, బంటు విఠల్ తదితరులు పాల్గొన్నారు. బిచ్కుందలోని బసవలింగ సంస్థాన్ మఠంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. సోమాయప్ప స్వామికి పాదపూజ నిర్వహించి హారతి ఇచ్చారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మల్లికార్జున్ అప్ప, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గంగాధర్, పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, శెట్కార్ రాజు పటేల్, సిద్ధప్ప పటేల్, భక్తులు పాల్గొన్నారు.

లింగంపేటలోని దత్తాత్రేయ, సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజతోపాటు అభిషేకం, హారతి, తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కామారెడ్డిలోని యోగా భవన్‌లో యోగా గురువు రాంరెడ్డిని యోగాచార్యులు గరిపల్లి అంజయ్య గుప్తా, సీనియర్ సిటిజన్ భవన్‌లో యోగా గురువు రాంచంద్రాన్ని యోగాసభ్యులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో యోగా సభ్యులు రఘుకుమార్, అంజయ్య, రమేశ్, సిద్ధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నెమ్లి సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బిచ్కుందలో సోమాయప్ప స్వామికి హారతి ఇస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయంలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట పలువురు నాయకులు ఉన్నారు.

నేడు 'ప్రజావాణి'

నాగిరెడ్డిపేట, జూలై 21: నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజావాణి ఉంటుందని తెలిపారు.

మహిళ కడుపులోంచి ఐదు కిలోల కణతి తొలగింపు

గాంధారి, జులై 21: కడుపునొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులో నుంచి ఆపరేషన్ చేసి ఐదు కిలోల కణతిని వైద్యులు తొలగించారు. మైలారం గ్రామానికి చెందిన ఓ మహిళ కడుపునొప్పితో బాధపడుతూ గాంధారిలోని శ్రీసాయి దవాఖానలో చేరింది. పరీక్షించిన వైద్యుడు జయప్రకాశ్.. మహిళ కడుపులో కణతి ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం ఆపరేషన్ నిర్వహించి ఐదు కిలోల బరువు ఉన్న కణతిని తొలగించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని దవాఖాన వైద్యసిబ్బంది తెలిపారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి

లింగంపేట, జూలై 21: మండలంలోని జల్దిపల్లి గ్రామానికి చెందిన తిగుళ్ల హనుమంతు గేదె కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గేదెను మేపడానికి ఆదివారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్లారు. మేత మేస్తుండగా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.50వేల వరకు ఉంటుందని, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి బాధితుడికి పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 1 లక్షకే 121 చ.గజాల ప్లాట్, 20 మొక్కలతో, ఎర్రచందనం, మహాగని. ఫ్రీ మెయింటెనెన్స్, 10 సం॥లలో లక్షల ఆదాయం. Cont: 8500664291.
NT-325890

OLD AGE HOME

★ ఒంటిగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీ

గాంధారి/ లింగంపేట/ బిచ్కుంద, జూలై 21: జిల్లాలో పలువురు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. గాంధారి ఎంపీవోగా పనిచేస్తున్న రాజ్‌కిరణ్‌రెడ్డి భిక్కనూరు మండలానికి బదిలీ అయినట్లు ఎంపీడీవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. మండలంలోని పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 19 మంది పంచాయతీ కార్యదర్శులు కూడా బదిలీపై ఇతర మండలాలకు వెళ్లారని తెలిపారు. మండలంలోని పేట్ సంగెం, తిప్పారం, సర్వాపూర్, చద్మల్ తండా, గండివేట్ తండా, గుర్జాల్ తండా, సోమ్లానాయక్ తండా, పొతంగల్ కుర్దు, కాయితీ తండా, గొల్లాడీ తండా, గుడి వెనుక తండా, నేరల్, బ్రాహ్మణ్‌పల్లి, బీర్మల్, కరక్‌వాడి, పర్మళ్ల తండా, రాంపూర్‌గడ్డ, తిప్పారం తండా, సోమారం తండా గ్రామ పంచాయతీల కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. బదిలీ అయిన కార్యదర్శుల్లో అరుణ్, శ్రీకర్, లింగం, ఓంకార్‌గౌడ్, శిరీశ్, ప్రకాశ్, భాస్కర్, ఇలియాస్, రజిత, జనార్దన్, భార్గవి, ప్రశాంత్, జానకి, సరిత, సునీత, సింధు, కృష్ణవేణి, సుష్మ, శ్రీధర్ ఉన్నారు.

లింగంపేట మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన వారి స్థానంలో కొత్తగా వచ్చిన వారు బాధ్యతలను చేపట్టారని ఎంపీడీవో నరేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం నుంచి 14 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. మమత (రాంపూర్), అంజిబాబు (ఒంటర్‌పల్లి), జనార్దన్ (బాయంపల్లి), ఓంకార్ (అయ్యపల్లి), నవాబ్ షరీఫ్ (భవానీపేట), రవి (శెట్పల్లి), రమేశ్ (బోనాల్), సంతోష్‌కుమార్ (కోమట్‌పల్లి), కళ్యాణ్ (జగదంబతండా), రాజు (బాణాపూర్), లావణ్య (మాలపాటి), భాగ్యలక్ష్మి (అయ్యపల్లి తండా), సౌమ్య (కన్నాపూర్), యూసుఫ్ (ఎల్లారం)లో విధుల్లో చేరినట్లు ఎంపీడీవో తెలిపారు.

బిచ్కుంద మండలంలో ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాల కృష్ణ తెలిపారు. ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న మహబూబ్ బీర్కూర్ మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో నిజాంసాగర్‌కు చెందిన అబ్బాగౌడ్ బదిలీపై వచ్చారన్నారు. సీనియర్ అసిస్టెంట్ విఠల్ బాన్సువాడకు బదిలీ కాగా నాగిరెడ్డిపేట నుంచి వెంకట్ రాంరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రాజు జుక్కల్‌కు బదిలీ కాగా బాన్సువాడ నుంచి విజయ్ బదిలీపై వచ్చి బాధ్యతలను చేపట్టనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు.

ఎల్లమ్మకు బోనాల సమర్పణ

ఎల్లారెడ్డి రూరల్/ లింగంపేట/దోమకొండ/బీబీపేట్/ నస్రుల్లాబాద్, జూలై 21: మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న రేణుకా ఎల్లమ్మకు భక్తులు ఆదివారం బోనాలను సమర్పించారు. ఆటాపాటలు, డీజే చప్పుళ్లతో బోనాలను ర్యాలీగా ఆలయం వరకు తీసుకెళ్లారు. అమ్మవారికి బోనాలతోపాటు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు సంగని పోచయ్య, పద్మారావు తదితరులు పాల్గొన్నారు. లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో ముత్యాల పోచమ్మకు గ్రామస్తులు బోనాలను సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిపించి, పాడీపంటలను చల్లంగా చూడాలని దేవతను వేడుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దోమకొండ మండల కేంద్రంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాముండేశ్వరీ అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం కాలనీ వాసులు కొత్తారి మైసమ్మకు, బీబీపేటలో మహాంకాళి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శెట్పల్లి సంగారెడ్డిలో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

దోమకొండలో గ్రామ దేవతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు